www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 10 జూన్ 2023

గగనతలంలో విమానాలు సంచరించడంపై టీటీడీ దృష్టి

ప్రజాశక్తి-తిరుమల: తిరుమల గగనతలంలో గురువారం ఉదయం 7.45, 8, 8.22 గంటలకు మూడు విమానాలు సంచరించాయి. దీంతో టిటిడి అధికారులు ఈ ఘటనపై దృష్టి సారించారు. శ్రీవారి ఆలయ గగనతలం నుంచి విమానాలు వెళ్లడం నెల రోజుల వ్యవధిలో ఇది మూడోసారి కావడంతో భక్తులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగమశాస్త్రాల ప్రకారం తిరుమల ఆలయంపై నుంచి విమానాలు వెళ్లడం నిషిద్ధం. విమానాల రాకకు అడ్డుకట్ట వేసేలా శ్రీవారి ఆలయ గగనతలాన్ని 'నో ఫ్లై జోన్'గా ప్రకటించాలని పౌర విమానయాన శాఖకు టీటీడీ గతంలోనే విజ్ఞప్తి చేసింది. కానీ, ఈ దిశగా ఆశించిన పురోగతి మాత్రం లేదు. దీంతో, విమానాలు వచ్చి వెళ్లిన ప్రతిసారీ టీటీడీ వర్గాలు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాల్సి వస్తోంది.

అంగన్‌వాడీల బకాయి బిల్లులు చెల్లించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం ప్రాజెక్టులో అంగన్‌వాడీలకు బకాయి బిల్లులు వెంటనే చెల్లించి, వర్కర్లపై వేధింపులు మానుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలతో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అలాగే కుప్పం ప్రాజెక్టులో బకాయి ఉన్న బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుడిపల్లి మండలంలోని వర్కర్లను ఇబ్బంది పెడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య ఉంటే మాట్లాడి పరిష్కారం చేయాలే గాని ఫోన్లు తీసుకొని బెదిరించే పని చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై సిడిపిఒ స్పందించాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్ విషయంలో ప్రభుత్వం పెట్టిన నిబంధనలకు విరుద్ధంగా కుప్పం ప్రాజెక్టులో నడుస్తున్నదని దీనిపై జిల్లా ఉన్నతాధికారులు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన హెల్పర్లుకు ప్రమోషన్ ఇవ్వకుండా ఆ సెంటర్స్ కూడా నోటిఫికేషన్ చూపించి కొత్త వారిని నియమించే పని చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి సమస్యలు అనేకం కుప్పం ప్రాజెక్టులో ఉంటున్నాయని జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దష్టి పెట్టాలని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో ఐక్యంగా పోరా టాలు చేస్తామని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత, ప్రాజెక్టు నాయకులు కస్తూరి, సరళ, భారతి, అనిత, అముజాక్షి, రత్తమ్మ, మునిరత్నం, లక్ష్మి, లలితమ్మ, అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ హెల్పర్స్ పాల్గొన్నారు.

కార్మికవర్గాన్ని మోసపుచ్చేలా ప్రభుత్వ విధానాలు

'సిటు' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు / నేటి నుంచి తిరుపతిలో సిఐటియు రాష్ట్ర సమావేశాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బోగస్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని, కార్మికవర్గాన్ని మోసపుచ్చేలా రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. తిరుపతిలో 10-13 తేదీల్లో సిఐటియు నాయకత్వం కార్మిక సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. తిరుపతి సిఐటియు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ గ్యారంటీ పెన్షన్ స్కీం (జిపిఎస్)లో కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెన్షన్ గ్యారంటీ ఏమీ లేదన్నారు. దీనిని అందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంలోఉన్న 10శాతం కార్మికులకు చెల్లించాలనే విధానమే ఇందులోనూ ఉందన్నారు. ఇది నేతిబీరకాయలో నెయ్యి చందంగా ఉందన్నారు. కాంట్రాక్టు కార్మికులను 10,117 మందిని పర్మినెంట్‌చేస్తామని ప్రకటించారని, అయితే పాదయాత్రల్లోనూ, వైఎస్ఆర్ పార్టీ ఎన్నికల ప్రణాళికలోనూ 2.4 లక్షల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్‌చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. నేషనల్ హెల్త్ మిషన్, మున్సిపల్, టిటిడి, స్విమ్స్ ఆసుపత్రి, ఉపాధి పథకం, వెలుగు ఐకెపి, కస్తూరిబా విద్యా కేంద్రం, ప్రభుత్వరంగ సంస్థలలో ఒక్క కాంట్రాక్ట్ కార్మికుడూ పర్మినెంట్ కావడం లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయడం వాస్తవానికి బోగస్ అని తేలిపోయిందన్నారు. యూనివర్శిటీ నాన్ టీచింగ్ ఉద్యోగులకు

పిఆర్సి జీతాలు అమలు చేయకపోవటం, వయస్సు పరిమితిని 62 సంవత్సరాలకు పెంచకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్లో దేశంలో ప్రథమ స్థానంలో ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేస్తోందన్నారు. టిటిడిలో పాతికేళ్లకు పైగా పనిచేస్తున్న అటవీ కార్మికులు క్రమబద్ధీకరణ చేయాలని 945 రోజులుగా నిరాహారదీక్షలు చేస్తున్నారన్నారు. స్కీం వర్కర్ల జీతాలు పెంచాలని ఆందోళన చేస్తున్నా తెలంగాణాతో సమానంగానూ పెంచలేదన్నారు. ఉద్యోగ కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యలపై సిఐటియు రాష్ట్ర సమావేశాల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించడానికి తిరుపతి వేదిక కాబోతుందని తెలిపారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, కోశాధికారి కేఎన్ఎన్ ప్రసాదరావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి ఎన్. వాణిశ్రీ,, టిటిడి ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవ అధ్యక్షులు జి. వెంకటేష్, ఎపి రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ జి. నాగవెంకటేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఐక్య పోరాటాలు: ఎస్‌టియు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయ సమస్యలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు దేవరాజులు పిలుపునిచ్చారు. ఎస్‌టియు ఆవిర్భావ దినోత్సవాన్ని పుస్కరించుకొని స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ 1947న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్‌టియు ఆవిర్భవించి 77వ వడిలోకి అడుగుపెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు ఉమాపతి, పరంధామ, శ్రీనివాసులు, శివ లింగం, బాలచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: స్థానిక ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నెహ్రూ యువ కేంద్ర చిత్తూర్ నిర్వహించిన జిల్లా స్థాయి ప్రతిభా పోటీలకు విశేష స్పందన లభించింది. నృత్యం, కవిత్వం, వక్తృత్వం, చిత్రలేఖనం ఛాయాగ్రహణం అంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా చిత్తూరు జిల్లా ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, నెహ్రూ యోకేంద్ర సంఘటన్ రాష్ట్ర సంచాలకురాలు ఏఆర్ విజయ రావ్ పాల్గొన్నారు. ఈ పోటీలలో నత్య విభాగంలో యువప్రియ టీం, వక్తృత్వంలో సోనీ మొదటి స్థానంలో నిలిచారు. చాయాగ్రహణంలో సూర్య, చిత్రలేఖనంలో రాజకుమార్ మొదటి స్థానాల్లో నిలిచారు.

శిక్షణ తరగతులు విజయవంతం

యువతకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపల్ రమేష్‌బాబు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రుక్మిణి కృష్ణస్వామి జూనియర్ కళాశాల ఈనెల 5వ తేది నుంచి 9వ తేది వరకు యవతకు పర్సనాలిటీ డెవలప్మెంట్‌పై ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించిన స్పెషల్ ఫోకస్ శిక్షణా తరగతుల ముగింపు సమావేశం శుక్రవారం స్థానిక ఆర్‌కె జూనియర్ కళాశాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొని యువతకు దిశానిర్దేశం చేశారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, యువత చెడు అలవాట్లకు లోను కాకుండా సన్మార్గంలో దేశ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంచి ఆహార అలవాట్లు అలవరుచుకోవాలన్నారు. సంప్రదాయాలను గౌరవించడంతో పాటు దేశం కోసం ప్రాణత్యాగం చేసిన దేశ భక్తులు, శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి రఘుపతి, జిల్లా యూత్ కోఆర్డినేటర్ సాయి లక్ష్మి, జిల్లా స్పిరిచువల్ సమన్వయ కర్త యశోదలు నేటి పరిస్థితుల్లో యువత ఎలా ఉండాలో తెలియజేశారు. ఈ సందర్భంగా 225 మంది విద్యార్థులకు, సర్టిఫికెట్స్, ప్రతి ఒక్కరికీ ప్రపంచ పర్యవనం పురస్కరించుకుని మొక్కలను కాలేజ్ ప్రిన్సిపల్ రమేష్ బాబు అందించారు. వాటిని వారి వారి ఇండ్లలో నాటి వాటి పెరుగుదలను చూడాలి అన్నారు. సమితి సభ్యులు శేష నారాయణ, దేవరాజులు, పాండురంగ, గజేంద్ర రెడ్డి, శంకర్, రవికిరణ్, శ్రీనివాసన్, హైమావతి, వాసవి, యశోదా, యామిని, భవాని పాల్గొన్నారు.

జాతీయ రహదారుల అభివృద్ధికి చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చెన్నయ్-బెంగళూరు, చిత్తూరు - తచ్చురు ఎక్స్ ప్రెస్ హైవే, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి రోడ్ల అభివద్ధికి సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో క్లియరెన్స్ చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదే శించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్ నందు జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ యన్.రాజశేఖర్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చెన్నై-బెంగళూరు, చిత్తూరు-తచ్చురు ఎక్స్ ప్రెస్ హైవే, యన్.హెచ్ హైవే, ఆర్ అండ్ బి, డివిజన్ రోడ్ల అభివద్ధికి భూములు డికెటి, వైలేషన్ వంటివి వెంటనే పూర్తి చేయాలని, రోడ్లు నిర్మాణానికి సంబంధించి విద్యుత్, ఆర్అండ్‌బి, ఉద్యానవనం, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ ఏపిఐఐసి, ఇరిగేషన్ శాఖల ద్వారా క్షేత్ర స్థాయిలో క్లియరెన్స్ చేయించాలని సంబందిత ఆర్డీఒలను, తహశీల్దార్లును ఆదేశించారు. భూసేకరణ ఆలస్యంతో కొన్ని చోట్ల పనులు నిదానంగా జరుగుతున్నాయన్నారు. బైరెడ్డిపల్లి, బంగారుపాళ్యం, గుడిపాల, పలమనేరు, యదమరి, ఐరాల, విజయపురం, నింద్ర చౌడేపల్లి, రొంపిచేర్ల, పులిచెర్ల, ఎస్ఆర్ పురం, గంగాధర్ నెల్లూరు మండలాల పరిధిలో అవసరమైన చోట్ల అవార్డులు, డబ్బులు అందజేయాలన్నారు. చిత్తూరు, గుడిపాల, తవణంపల్లి, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలలో విద్యుత్ శాఖ ద్వారా ఏర్పాటు చేసి విద్యుత్ సబ్ స్టేషన్స్ నిర్మాణాలకు అవసరమైన భూములను వెంటనే అందజేయాలని తహశీల్దార్‌లను ఆదేశించారు.

సోమ, శుక్రవారాలలో ఏ ఒక్క తహశీలాద్ర్ సెలవులో వెళ్ళడానికి వీలులేదని, జిల్లా కలెక్టర్, జేసి ద్వారా పర్మిషన్ తీసుకొని తర్వాతనే సెలవు పెట్టుకోనే విదంగా తహశీల్దార్‌లకు ఆదేశాలు ఇవ్వాలని ఆర్డీఓలను ఆదేశించారు. రోడ్లు అభివద్ధికి సంబంధించి స్ట్రక్చర్స్‌ను సోమవారం నాటికి పూర్తి చేయాలన్నారు. యన్‌హెచ్ పిడి కార్తీక్ రెడ్డి, డిడి ఉద్యాన శాఖ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌సీడి-సిడి సర్వే 80 శాతం పూర్తవ్వాలి

ఎన్‌సిడి-సిడి సర్వే వచ్చే శుక్రవారం నాటికి 80 శాతం పూర్తవ్వాలని కలెక్టర్ ఎస్.షన్మోహన్ మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో, మెడికల్ ఆఫీసర్లతో ఎన్‌సిడి సిడి సర్వే, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, కంటి వెలుగు, వైఎస్ఆర్ విలేజి హెల్త్ క్లినిక్, అనిమిక్ టెస్టింగ్ తదితరాలపై సమీక్షించారు. ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబంలోని సభ్యుల ఆరోగ్య స్థితిగతులను సంపూర్ణంగా తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డి ఐ ఓ డాక్టర్ రవి రాజు, డి పి ఎం ఓ డాక్టర్ శ్రీనివాస రావు, ఆర్ బి ఎస్ కే డాక్టర్ సుదర్శన్, ఎం సి హెచ్ డాక్టర్ శిరీషా, జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, ఎపి డిమాలజిస్ట్ శ్రీవాణి పాల్గొన్నారు.

జాతీయ రహదార్ల భూ సమస్యలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

స్కూళ్లు తెరచే నాటికి 'నాడు-నేడు' పూర్తవ్వాలి

ఈనెల 12వ తేదీ స్కూళ్లు తెరచే నాటికి 'నాడు-నేడు' ద్వారా జరుగుతున్న పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్ నందు జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తో కలసి నాడు నేడు ద్వారా జరుగుతున్న పనులు, జగనన్న విద్య కిట్లు పంపిణీ, జగనన్న అణిముత్యాలు కార్యక్రమాల పై జడ్పీ సీఈఓ, సిపిఓ, డిపిఓ, పిడి లు డ్వామా, డిఆర్డీఏ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్, యం.పిడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, యం ఈ ఓ లు, ఏపీఓలు, ఎపియం ల తో సమీక్ష సమావేశం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ నెల 12 నాటికి నాడు నేడు ద్వారా జరుగుతున్న పనులను పూర్తి చేయాలని యం పి డి ఓ లను, యంఈఓలను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, సిపిఓ ఉమాదేవి పాల్గొన్నారు.

ఆధార్ జనన ధ్రువీకరణాలు

0-5 సంవత్సరాల వయసుగల పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రం మంజూరుతో పాటు ఆధార్ కార్డు పొందేలా సిడిపిఒలు పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్త్రీ శిశు సంక్షేమ శాఖకు సంబంధించి సిడిపిఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చిన్నపిల్లల బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు మంజూరు, బరువు తక్కువ గల పిల్లల వద్ధికి తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు ఆధార్ కార్డు ప్రతి లబ్ధిదారునికి ముఖ్యమని... ఆ విధంగానే పుట్టిన బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రమును పొందేలా చేసి వారికి ఆధార్ కార్డు ఇప్పించే బాధ్యత సిడిపిఒలు చేయాలని, క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ పనిని సమర్ధవంతంగా చేయాలని ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఐసిడిఎస్పిడి నాగ శైలజ, సిడిపిఒ లు పాల్గొన్నారు.

గృహ లక్ష్యాలను పూర్తి చేయండి

వేగంగా గృహ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గృహ నిర్మాణ పురోగతి-లబ్ధిదారులకు రుణాల మంజూరు, అమృత్ సరోవర్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, స్వామిత్వ పురోగతిపై జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలిసి సంబంధింత జిల్లాస్థాయి అధికారలు, అన్నిమండలాల ఎంపిడిఒలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గహ నిర్మాణ పురోగతికి సంబంధించి ఇండ్లు పూర్తి అయ్యేందుకు లబ్ధిదారులకు అవసరమైన రుణాలు మంజూరులో డిఆర్‌డిఎ, మెప్మా పిడిలు చొరవ చూపాలన్నారు. లబ్ధిదారులకు రుణాలు మంజూరు ద్వారా వారి ఇంటి నిర్మాణాలు పూర్తి అవుతాయని తెలిపారు. జులై నెలాఖరుకు ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, గృహ నిర్మాణ సంస్థ పిడి పద్మనాభం, పంచాయతీ రాజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, పిడిలు డిఆర్డీఏ, డ్వామా, తులసి, గంగభవాని, డిపిఒ లక్ష్మి, సిపిఒ ఉమాదేవి, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి - నెల్లూరు మధ్య ఎలక్ట్రిక్ బస్సులు

సర్వీసులు ప్రారంభించిన ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

నెల్లూరు జిల్లా ప్రజలకు విద్యుత్ ఏసి బస్సుల సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏ పీ ఎస్ ఆర్ టి సి) చైర్మన్ ఏ.మల్లికార్జున రెడ్డి శుక్రవారం నెల్లూరు - తిరుపతి మధ్య ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను జెండా ఊపి ప్రారంభించారు. తిరుపతి- నెల్లూరు మధ్య 12 బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. ఆరు బస్సులు నిర్ణీత సమయంలో నెల్లూరు నుంచి బయలుదేరితే మరో ఆరు బస్సులు తిరుపతి నుంచి ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ఏ పీ ఎస్ ఆర్ టి సి ఓలెక్ట్రా గ్రీన్టెక్ సంస్థకు చెందిన 50 బస్సులను తిరుపతి-తిరుమల మధ్య నడుపుతోంది. కొద్ది రోజుల క్రితం తిరుపతి- కడప మధ్య కూడా ఎలక్ట్రిక్ ఏ సి బస్సుల సేవలు ప్రారంభం

అయ్యాయి. తాజాగా నెల్లూరు- తిరుపతి రూట్లో ఓలెక్ట్రా గ్రీన్ టెక్ ఏ సి విద్యుత్ బస్సుల సేవలను ఏ పీ ఎస్ ఆర్ టి సి ప్రారంభించింది. ఈ బస్సులో డ్రైవర్ సహా 35 మంది ప్రయాణం చేసేందుకు అవకాశం ఉంది. ట్రాఫిక్, ప్రయాణికుల సామర్థ్యాన్ని బట్టి ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 200 కిలోమీటర్లు ఈ బస్సులు ప్రయాణం చేస్తాయి ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ హితమే లక్ష్యంగా ఆర్ టి సీ విద్యుత్ బస్సులను ప్రవేశ పెడుతోందని చెప్పారు. త్వరలో మరిన్ని పట్టణాల నుంచి విద్యుత్ బస్సుల సేవలు అందిస్తామన్నారు. ప్రభుత్వం విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే తిరుపతి-తిరుమల, తిరుపతి-కడప మధ్య రాకపోకలు సాగిస్తున్న విద్యుత్ బస్సులకు మంచి ఆదరణ లభిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ పీ ఎస్ ఆర్ టి సి జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజ, ప్రజరవాణా శాఖ, ఓలెక్ట్రా గ్రీన్ టెక్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలు నిర్ణయించుకోవాలి

ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరేందుకు విద్యార్థి దశలోనే నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, విజయం సాధించేవరకరూ విరామం ఇవ్వరాదని అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి రజని పిలుపునిచ్చారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులతో శుక్రవారం "ఇంటరాక్షన్ విత్ రజని" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమారి రజని మాట్లాడుతూ, తాను తిరుపతిలోనే చదివి నిరంతర శ్రమతో అనేక పరాజయాల నడుమ అంతర్జాతీయ క్రీడాకారిణిగా విజయం సాధించానని చెప్పారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దయతో తాను ఈ స్థాయికి చేరుకోగలిగానన్నారు. జీవితంలో సమస్యలు ఎన్ని వచ్చినా వెనుకంజవేయకుండా లక్ష్యసాధన దిశగా దూసుకుపోవాలని ఆమె పిలుపునిచ్చారు.

భవిష్యత్ నిర్దేశకులు యువతే: ఎంపి రెడ్డెప్ప

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: యువత జాతి నిర్మాతలు అని, భవిష్యత్తు నిర్దేశకులని చిత్తూర్ పార్లమెంట్ సభ్యులు ఎన్ రెడ్డప్ప అన్నారు. శుక్రవారం ఎస్వీ సెట్ కళాశాల ప్రాంగణంలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర చిత్తూర్ ఆధ్వర్యంలో జిల్లా యువ ఉత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ నేటి విద్యార్థులు విద్యతో పాటు వివిధ రంగాలలోనూ ప్రావీణ్యత సంపాదించి దేశ కీర్తి ప్రతిష్టలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్తు యువత మీదనే ఆధారపడి ఉందని అన్నారు. యువకులు క్రమశిక్షణతో దేశభక్తితో సేవా భావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నెహ్రూ యువ కేంద్ర సంచాలకురాలు విజయరావు మాట్లాడుతూ నెహ్రూ యోగేంద్ర భారతి యువత కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నారనానరు. యువత విజ్ఞానవంతులై దేశ సౌభాగ్యానికి కషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర సమన్వయకర్త ప్రదీప్ కుమార్, ఎస్ వి సెట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్ బాబు, అకౌంట్స్ ఆఫీసర్ బాబు రెడ్డి, గురజాడ ఫౌండేషన్ అధ్యక్షులు హరికష్ణ రెడ్డి, విశ్రాంతి ఇరిగేషన్ అధికారి మునిచంద్ర నాయుడు, ప్రొఫెసర్ కార్తికేయన్ పాల్గొన్నారు.

యువ ఉత్సవ్‌లో మాట్లాడుతున్న ఎంపి రెడ్డెప్ప

ప్రతి గడపలో మహిళల సమస్యలు తెలుసుకోండి: డిఐజి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రతి గడపకూ వెళ్ళి మహిళా సమస్యలు తెలుసుకోవడమే లక్ష్యంగా మహిళా పోలీసులు సర్వే నిర్వహిస్తున్నట్లు అనతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఐదో డివిజన్ సచివాలయంలో యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భముగా డి.ఐ.జి మాట్లాడుతూ "ప్రతి గడపకూ మహిళా పోలీస్" సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్ళే మహిళా పోలీసులు సాధారణంగా కాకుండా వారితో మమేకమై మనసు పెట్టి వారితో మాట్లాడినప్పుడు వారు వారి సమస్యలను ధైర్యంగా తెలియజేస్తా రన్నారు. ప్రతి గడపకు వెళ్ళిన సమయంలో ఆ ప్రదేశంలో ఏం జరుగుతోంది, ఏదైనా సంఘవ్యతిరేఖ పనులు లేదా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలు ఏవైనా జరిగాయా అనే విషయా లు ఆరా తీయాలన్నారు. భూతగాదాలు, లైంగిక వేధింపులు, అసూయ వల్ల ఎక్కువగా నేరాలు జరుగుతున్నాయన్నారురు. ముందుగా తెలుసుకుంటే వాటిని అరికట్టే అవకాశం ఉందన్నారు. ఈ సర్వేలో మహిళా పోలీసుల పాత్ర ఎంతో కీలకమన్నారు. సైబర్ నేరాల గురించి ఈ సందర్భంగానే అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మహిళ మొబైల్‌లో దిశాయాప్‌ను ఇన్‌స్టాల్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సగిలి షన్మోహన్ , మునిసిపల్ కమిషనర్ జె.అరుణ, నగర మేయర్ ఆముద, 5వ డివిజన్ కార్పొరేటర్ హరిణి రెడ్డి, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్ పాల్గొన్నారు.

యాప్‌ను ఆవిష్కరిస్తున్న డిఐజి అమ్మిరెడ్డి

అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

ప్రజాశక్తి-నగరి: అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని నగరి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని వీఎంకే కల్యాణమండపంలో నిర్వహించిన నగరి నియోజకవర్గ విస్తత స్థాయి సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరిలో, రాష్ట్రంలోనూ గెలవబోయేది తెలుగుదేశం పార్టీ అని, మహిళలు, యువత, రైతు అభివద్ధే లక్ష్యంగా మొదటి విడత మేనిఫెస్టో ఉందన్నారు. భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన మొదటి మేనిఫెస్టోను ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత మనం దరిపై ఉందన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తా మేనిఫెస్టోలోని మహాశక్తి, తల్లికి వందనం, అన్నదాత, యువగళం నిరుద్యోగ భతి తదితర పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని సూచించారు. నగరి నియోజకవర్గ ప్రజలు కోరుకున్నవే తన ఎజెండా, నగరి ప్రజలకోసం, నగరి అభివద్ధి ఎజెండాగా పని చేస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అన్ని మండలాల నుంచి భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముద్దన్న 76వ జయంతి వేడుకలు

ప్రజానాయకుడు, మాజీ మంత్రి గాలి ముద్దుకష్ణమ నాయుడు 76వ జయంతి వేడుకలను నగరి నియోజకవర్గ తెలుగుదేశం శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, కేకు కోసి కార్యకర్తలకు పంచి పెట్టి నివాళులర్పించారు. జోహార్ ముద్దన్న, జిఎంకె అమర్ రహే అంటూ నినాదాలతో ముద్దన్న అభిమానులు ఆయన చేసిన సేవలను కీర్తించారు.

జగనన్న విద్యా కానుక సిద్ధం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: జగనన్న విద్యా కానుక సర్వం సిద్ధం చేసినట్టు డీఈవో విజయేంద్రరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల మండలానికి సరఫరా చేసేందుకు వచ్చిన యూనిఫాం, బ్యాగులు, షూలు, అచ్చు, నోటు పుస్తకాలు, బెల్టులు మొదలగునవన్నీ అందుబాటులో ఉన్నట్లు డీఈవో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేటాయించిన అన్ని పాఠశాలలకు విద్యా కానుకను అందించాలని, జూన్ 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని, ఆరోజే పంపిణీ చేపట్టాలన్నారు. విద్యార్థులను కార్పొరేట్ పాఠశాల విద్యార్థులుగా తయారు చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, దీనిని ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి, ఉపాధ్యాయులు అవలంబించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ, సీఆర్పీలు సుశీల, హేమలత, సతీష్, సుధాకర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్ష మాతత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారుల ఆదేశాల మేరకు డాక్టర్ విజయచంద్రన్ ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లిళ్లు జరగడంతో వారికి మానసికంగా, శారీరకంగా ఎదుగుదల ఉండదు. మాతా శిశు మరణాలు సంభవిస్తాయని తెలిపారు. పోషకాహారం వ్యాధి నిరోధక టీకాలు, తల్లిపాలు ప్రాముఖ్యత గురించి తెలిపారు. మారుతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కుటుంబంలో స్త్రీ పాత్ర ముఖ్యమైంది. కావున పోషకాహారం తీసుకుని తల్లీబిడ్డ క్షేమంగా ఉండాలని, ప్రభుత్వ సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకుని ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. సావిత్రి హెల్త్ ఎడ్యుకేటర్ మాట్లాడుతూ ప్రతినెలా డాక్టర్ పరీక్షలు ముఖ్యమని, ప్రమాదకర లక్షణాలున్న గర్భిణులు డాక్టర్ సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, తిమ్మక్క, టిఎస్ బుజ్జి, శాంతమ్మ, కార్తికేయ, వైద్య సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా ప్రేమ్ రాజకుమార్

ప్రజాశక్తి-పాలసముద్రం: పాలసముద్రం ఎంపీడీవోగా ప్రేమ్ రాజకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతకు ముందు శ్రీకాళహస్తి మండలంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల సహాయంతో అభివృద్ధి చేస్తానని తెలిపారు.

వైసీపీ పాలనలో యువతకు అన్యాయం

ప్రజాశక్తి-రామకుప్పం: వైసీపీ పాలనలో యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని టిడిపి యువత ఆధ్వర్యంలో చైతన్య సదస్సు నిర్వహించి నిరుద్యోగులకు తెలుగుదేశం పార్టీతోనే భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలుగు యువత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శంకరాచలం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని విజలాపురం, బల్ల, వీర్నమల, ఉనిసిగాని పల్లి, కెంచన బల్ల తదితర గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో మహాప్రదర్శన చైతన్య సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ సందర్భంగా ఈనెల 11వ తేదీ ఉదయం టిడిపి కార్యాలయం నుంచి బందార్లపల్లి క్రాస్ వరకు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా నిరుద్యోగులను భవిష్యత్తు లేకుండా చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి, కుమార్, జ్ఞాన శేఖర్ రెడ్డి, పలువురు యువత, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-నగరి: విద్యుత్ సబ్‌స్టేషన్ల సర్వీసులో భాగంగా శనివారం నగరి, నెత్తం కండ్రిగ, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పోటీ పరీక్షల శిక్షణలో విశ్వం అగ్రగామి

ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్ర స్థాయిలో 2023 విద్యా సంవత్సరంలో ఏపీఆర్‌జేసీ ప్రవేశానికి మే 20వ తేదీన నిర్వహించిన ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాల్లో తిరుపతి విశ్వం విద్యా సంస్థలో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తతీయ ర్యాంకులతో పాటు వివిధ విభాగాల్లో 10 లోపు 9 ర్యాంకులు సొంతం చేసుకుని విశ్వం విద్యా సంస్థలకు తిరుగు లేదని నిరూపించారని విశ్వం విద్యా సంస్థల అధినేత యన్. విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ యన్.విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, సాయి గణేష్ స్కూల్ అధినేత చెంచు రెడ్డి తదితరులు విద్యార్థుల్ని అభినందించారు.

నేడు శ్రీకాళహస్తిలో నడ్డా బహిరంగ సభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శనివారం శ్రీకాళహస్తిలో పర్యటించనున్నారు. ముందుగా ఆ పార్టీ కీలక నాయకులతో సమావేశమై పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలపై చర్చలు జరుపుతారు. సాయంత్రం స్థానిక బేరివారం మండపం వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడుతారు. ఆ మేరకు శుక్రవారం బహిరంగ సభ జరుగు ప్రాంతాన్ని రాష్ట్ర భాజపా అధ్యక్షుడు సోము వీర్రాజు పరిశీలించారు. వారితో పాటు శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ కుమార్, కో-కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్ బాబు, కొండేటి గోపాల్, కన్నా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కోనేటి అయ్యప్ప, పుణ్యం ఢిల్లీ బాబు, వేంకటేశ్వర్లు ఆచారి పాల్గొన్నారు.

ఎన్‌ఎన్‌ఆర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా మురళీరెడ్డి

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం హాస్టల్ టీచింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా ఏపీ యూనివర్సిటీస్ వైయస్సార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కే.మురళి రెడ్డిని ఎన్నుకున్నట్లు ఆ సంఘం సెక్రటరీ లోకేష్ వెల్లడించారు. శుక్రవారం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు. పి. నాగరాజును గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గౌతమి, గౌరీ, అశోక్, మహేష్, ధనుంజయలు, ముని కష్టారెడ్డి, సురేష్, మోహన్, చంగమ్మ, వనజాక్షి పద్మావతి, రాజా, గిరిబాబు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-రేణిగుంట: అపరిచిత వ్యక్తుల కదలికలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని రేణిగుంట డి.ఎస్.పి భవ్య కిషోర్ తెలిపారు. శుక్రవారం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లమండ్యం పద్మానగర్‌లో విలేజ్ మీట్ కార్యక్రమంలో డి.ఎస్.పి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో ఆమె మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, అక్రమ మద్యం అపరిచిత వ్యక్తులు కదలికలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలకు రక్షణగా పోలీసులు ఉన్నారని భరోసా ఇచ్చారు. గాజులమండ్యం సీఐ సుబ్బరాయుడు, ఎస్సై ధర్మారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ నాగూర్, కానిస్టేబుళ్లు రాంబాబు, ఢిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణీకులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి-గూడూరు: ప్రయాణీకులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం తిరుపతి జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ చెంగల్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన గూడూరు ఆర్టీసీ డిపోను పరిశీలించారు. డిపో మేనేజర్, ఇతర అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితమన్నారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. ప్రయాణీకులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. గూడూరు నుండి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడుపు తున్నామన్నారు. అలాగే ఇటీవల నెల్లూరులో ప్రయాణీకుల సౌకర్యార్థం 12 ఎలక్ట్రిక్ బస్సులను ఛైర్మన్ భల్లికార్జున్ రెడ్డి, జోనల్ ఛైర్మన్లు ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే గూడూరు నుంచి తిరుమలకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌లో బస్సు ఏర్పాటు చేశామన్నారు. రెండు ఏసీ బస్సులు సిద్ధం చేసినట్లు తెలిపారు.

మీ భద్రతే.. మా బాధ్యత

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మీ భద్రతే మా బాధ్యత అని సిఐ నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలం కేంద్రంలో మీ భద్రతే మా బాధ్యత కార్యక్రమం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి గడపగడపకు పోలీస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతి ఇంట్లోని వ్యక్తిగత, ఇతర సమస్యలపై పోలీసులు జిఎంఎస్‌కేల ద్వారా సమాచారాన్ని అందించారని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు అవలంబిస్తామన్నారు. చైల్డ్ మిస్సింగ్, డోర్ లాక్, దిశా యాప్ సమస్యలను వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ జిఎంఎస్‌కేలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

సంపాదనకు వయసు అడ్డుకాదు

ప్రజాశక్తి-గంగవరం: సంపాదనకు వయసు అడ్డుకాదని మండలంలోని నాగమంగళం గ్రామానికి చెందిన అబ్దుల్ బాషా (75) అన్నారు. శుక్రవారం ప్రజాశక్తి ఆయన్ను పలకరించగా తన విషయాలను పంచుకున్నాడు. సైకిల్ మీద జమ్ముతో తయారుచేసిన చాపలను తీసుకొని రోజుకు 30 నుంచి 50 కిలోమీటర్ల వరకు సైకిల్ మీదనే ప్రయాణించి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాను. నాకు మొత్తం ఐదుగురు సంతానం. అందరికీ పెళ్లిళ్లు చేశాను. వారందరూ వారి వారి ఇళ్లవద్దే ఉన్నారు. ప్రస్తుతం నా ఇంట్లో నేను, నా భార్య మాత్రమే ఉన్నాం. నేను చాపలమ్మి రోజుకు రూ.500 వరకు సంపాదించుకొని నా భార్య నేను హాయిగా ఉంటున్నాం. ఏదైనా పండుగ, శుభకార్యాలకు పిల్లలందరూ మా ఇంటికి వచ్చి రెండు రోజులు గడిపి వారి దారిన వారు వెళ్లిపోతారు. నాలో శక్తి ఉన్నంతవరకు నేనే స్వయంగా సంపాదించుకుని జీవనం సాగిస్తాం. ఈయన్ను పలువురు గ్రామస్తులు ఆదర్శంగా తీసుకోవాలని అనుకుంటున్నట్లు సమాచారం.

వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-సోమల: విద్యార్థులు చదువుతోపాటు వ్యాయామం చేయడంతో ఆరోగ్యంగా ఉండవచ్చని గ్రంథాలయ అధికారి రామకృష్ణ అన్నారు. శుక్రవారం చిన్నారులకు గ్రంథాలయ కార్యాలయంలో వ్యాయామంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే వ్యాయామం చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఒడిస్సా రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని తిరుపతి మాజీ పార్లమెంటు సభ్యుడు చింతామోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం రైల్వే ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గూడూరు రైల్వే స్టేషన్ వద్ద తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ నరసింహారెడ్డి శుక్రవారం తెలిపారు. గురువారం మండలంలోని మొగిలివారిపల్లిలో జరిగిన టీడీపీ, వైసీపీ నాయకుల ఘర్షణలో మండలంలోని పిడివి కండిగ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు శ్రీనివాసులు నాయుడు కుమారుడు సోమేశ్వర ప్రభు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొగిలివారిపల్లికి చెందిన సుధాకర్ నాయుడు కుమారుడు విజయ్ కుమార్, శంకర్ నాయుడు కుమారుడు బాలసుబ్రమణ్యం, వీర ప్రకాష్ కుమారుడు దిలీప్ చౌదరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరుని సేవలో హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ కమ్మపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీవారి కల్యాణోత్సవం, గరుడసేవ నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ బ్రహ్మోత్సవాలలో హైకోర్టు జడ్జి రమేష్ దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

ప్రజాశక్తి-సోమల: మహిళా సంఘాలలోని సభ్యులు బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించి ఆర్థికంగా అభివద్ధి చెందాలని ఏపీఎం శివ అన్నారు. శుక్రవారం మండలంలోని నంజంపేటలో వివో వన్ ఈసీ సమావేశాన్ని సంఘమిత్రలు, వీవో లీడర్లు సంఘ సభ్యులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి మహిళా సంఘాలలో సభ్యురాలుగా ఉండాలని, దీనికి సంఘమిత్రలు, వివో, సంఘ లీడర్లు గ్రామాలలో విస్తతంగా ప్రచారం చేయాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

హోరుగాలి... వర్షం

ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధిలో శుక్రవారం సాయంత్రం హోరుగాలితో వర్షం కురిసింది. వర్షం తాకిడికంటే గాలి వేగంగా వీచడంతో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగిపోవడంతో సుమారు మూడు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విరిగిన చెట్లను తొలగించి పరిస్థితి యథాస్థితికి తీసుకురావడానికి విద్యుత్ శాఖ, మున్సిపల్ సిబ్బంది శ్రమపడాల్సి వచ్చింది. సమస్యను సరిచేసి రాకపోకలకు సౌకర్యం కల్పించడంతో పాటు విద్యుత్ సరఫరాను అందించారు.

అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ సబ్జెక్టును తాత్కాలిక ప్రాతిపదికన బోధించేందుకు అతిథి అధ్యాపకులు కావాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పోస్టుగ్రాడ్యుయేషన్‌తో పాటు యుజిసి నెట్, ఏపీసెట్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సోమవారం కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

గాపచేనులో వీధిదీపాల ఏర్పాటు



ప్రజాశక్తి-తొట్టంబేడు: మండలంలోని పొయ్యి పంచాయితీ గాపచేను గ్రామంలో వీధి దీపాలను సర్పంచ్ సక్కుబాయమ్మ కుమారుడు మణి వేయించాడు. చీకట్లో నడవడానికి గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారని, రోడ్డుపై విష సర్పాలు వస్తున్నాయని తెలియజేయడంతో స్పందించిన సర్పంచ్ కుమారుడు శుక్రవారం వీధి దీపాలు వేయించారు. ఆయనకు గ్రామస్థులు అభినందనలు తెలియజేశారు.

సత్యవేడు తహాశీల్దారుగా షేక్ జరీనా

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు తహాశీల్దారుగా షేక్ జరీనా నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న తహాశీల్దారు శ్రీదేవి కేవీబీపురం బదిలీ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వెంకటరమణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని మొగిలివారి పల్లి సచివాలయం పరిధిలోని బలిజ పల్లి, పాలమాకులపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎంపీడీవో హరిప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి గడప గడపకు వెళ్లి సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అప్పుడే పుట్టిన పాప నుంచి ముసలివారి వరకు పలు సంక్షేమ పథకాలు ప్రారంభించిన ఘనత సీఎం జగన్‌కే దుక్కుతుందన్నారు. కార్యక్ర మంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్, తహశీల్దార్ బెన్ రాజ్ పాల్గొన్నారు.

రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థిక అభివద్ధి చెందాలని చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం రామకుప్పం మేజర్ గ్రామపంచాయతీలోని రెడ్డి వీధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాకాలను వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పనకు అవసరమైన నిధులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ బాబు రెడ్డి, కో కన్వీనర్ చంద్ర రెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, సర్పంచ్ మురళి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: గ్రామీణ ప్రాంత రైతులకు రైతు భరోసా కేంద్రాలు వ్యవసాయ క్షేత్రాలుగా ఉంటూ ప్రజలకు అవసరమైన వ్యవసాయ సంబంధమైన సమస్యలను పరిష్కరించేందుకు రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే వెంకటే గౌడ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దకాప్పల్లి గ్రామ సచివాలయ పరిధిలోని శాంతినగర్, తిప్పిరెడ్డిపల్లి, కొత్తబూరగపల్లి, పెనుగోలకల, పెద్దకాప్పల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాల్లో స్థానిక సర్పంచ్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మీ గడప వద్దకే మీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డప్ప, మండలకన్వీనర్ బాగా రెడ్డి, వైస్ ఎంపీపీ జీడి బాబు, అంజమ్మ, పిఎసిఎస్ ఛైర్మన్ ఓబుల్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు హరినాథ్, తమ్మిరెడ్డి, రాజారెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మ్యాక్స్ వ్యాల్యూ
క్రెడిట్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్
రిజిష్టర్డ్ కార్యాలయము / ప్రధాన కార్యాలయము: త్రిసూర్)
సిన్: యు65921కెఎల్1995పిఎల్‌సి009581
బెంగళూరు ప్రాంతీయ కార్యాలయము: నెం.16/ఎ, 9వ మెయిన్‌రోడ్డు, 3వ బ్లాక్, జయనగర్, బెంగళూరు - 560011, ఫోన్: 080-29650516
ఈమెయిల్: blrro.goldloans@maxvaluecredits.com
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా మా సంస్థ నందు బంగారు నగలు తాకట్టు పెట్టి రుణాలు పొందిన వారందరికీ అనేక సార్లు నోటీసులు పంపినప్పటికీ వారి యొక్క బకాయిలు చెల్లించని కారణంగా మరియు నగలను విడిపించుకోకపోవడం వలన దిగువ తెలిపిన షెడ్యూలు ప్రకారం వేలం వేయబడుతుంది. వేలంలో పాల్గొనదలచిన బిడ్డరు ధరావత్తు రూపంలో రూ.5,00,000/- డిపాజిట్ చేయడంతో, పాటు ఫొటో ఐడికార్డు & పాన్ కార్డు వివరాలు కూడా సమర్పించవలెను. బిడ్‌లో గెలుపొందిన బిడ్డరు తమ యొక్క అన్ని చెల్లింపులు వ్యాట్‌తో సహా RTGS/NEFT ద్వారా చెల్లించవలెను.
చిత్తూరు వేలం సెంటర్:కుప్పం, వేలం తేది & సమయం: 16.06.2023 మ.3.00 గం॥లకు కుప్పం శాఖ ఖాతాలు: 10436400000064
పైన తెలిపిన తేదీన ఏదేని అనివార్య కారణాల వలన వేలం నిర్వహించని యెడల తదుపరి వేలం తేది మరియు ప్రదేశం వివరాలను కంపెనీ యొక్క వెబ్‌సైట్ నందు మరియు వేలం సెంటర్ నందు ప్రచురించబడుతుంది.
సం॥ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్